# ఆ పైన మీ యిష్టం

డిసెంబర్ నెలలో అది రెండో ఆదివారం. ముందు రోజు రాత్రి ఆఫీస్‌లో చాలా పని చేసి ఆలస్యంగా ఇల్లుచేరిన ఆనందరావ్, ముడిచిపెట్టుకుని పడుకున్నాడు. మలయవతి అతన్ని నిద్రలేపింది. "అప్పుడే తొమ్మిదయిందా! అంటూ నిద్రలేచాడు! మొహం కడుక్కుని రాగానే వేడి వేడి కాఫీ యిచ్చింది మలయవతి.

పక్కన కూర్చుని మొదలు పెట్టింది! "కొత్త బియ్యం వచ్చేశాయట, కిలో పదకొండు రూపాయలు, రెండు బస్తాలు వేయించుకోమన్నాడు పాల్ఘాట్ పరమశివన్".

"మళ్ళీ తెల్లారిందా ఈ సంసారం ఈదడానికి! అసలే ఇన్‌కమ్‌టాక్స్ ఎక్కువ పడుతోందని ఏడుస్తూంటే, ఈ కొత్త బియ్యం భారమొకటి, అసలీ పాల్ఘాట్ పరమశివన్ అంత దూరం నుంచి మన ఆంధ్రప్రదేశ్‌కి వచ్చి మనల్ని ఎందుకు బాధపెడుతున్నాడో! అనుకున్నాడు.

ఇంతలో మోగుతూన్న ఫోన్ తీసుకుని "హలో" అన్నాడు. "సార్! నేను నిన్న మిమ్మల్ని కలిసాను కదా! ఎల్.ఐ.సి పాలసీ గురించి ఫోన్ చేశాను.

"వద్దయ్యా! పాలసీ లేదు గీలసీ వద్దు! అసలు నాకు జీవితం మీద విరక్తి కలుగుతోంది! అసలు బతకాలని లేదు.

"అందుకే కదా సార్ ఎల్‌ఐసి పాలసీ! మీ వాళ్ళకి లాభసాటిగా ఉంటుంది! కట్ట వలసిన ఇన్‌కమ్‌టాక్స్ కూడా తగ్గుతుంది. అలా కలిసొచ్చిన డబ్బుపెట్టి, ఏడాదికి సరిపడ బియ్యం కొనుక్కోవచ్చు!"

"సరే ఆఫీస్‌లో రేపు కలు" అని ఫోన్ పెట్టేసి తన భార్యని పిలిచి, "ఈ కొత్త బియ్యం కొనాలన్న విషయం మొన్న వచ్చిన ఎల్ ఐ సి ఏజంట్‌కి ఏమైనా చెప్పావా! అన్నాడు కోపంగా.

"అయ్యో రామా! నేనెందుకు చెపుతానండీ మీ మీద ఒట్టు నేనేమీ చెప్పలేదు! అంది మలయవతి.

ఈ పరిస్థితులలో మళ్ళీ బియ్యం ప్రస్తావన తెస్తే గొడవలవుతాయని ఊరుకుంది.

ఓ రెండు గంటల తర్వాత పేపరు చదువుతూ నవ్వువకుంటూన్న ఆనందరావ్‌తో "ఇదే మంచి సమయమని" మళ్ళీ బియ్యం గురించి మొదలెట్టింది. "ఇప్పుడు బియ్యం చవకగా ఉన్నాయ్! ఇప్పుడు కొనుక్కోవడం మంచిది తర్వాత తర్వాత కిలో యిరవై రూపాయలు అయిపోతుంది, ఆపైన మీ యిష్టం!

"మళ్ళీ మొదలు పెట్టావ్! అసలు ఈ సంబంధం వద్దనుకుంటూంటే, మీ నాన్న మాయింటి చూట్టూ అదే పనిగా తిరిగి, నిన్ను నాకు కట్టపెట్టాడు. ఒకసారి పట్టుకుంటే వదలని గుణం మీ వంశంలోనే ఉంది. "అంటూ రోషంగా ప్యాంట్ షర్ట్ వేసుకుని వెళ్ళిపోయాడు ఆనందరావ్. మలయవతి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఒకటిన్నర అయిపోయింది! ఆనందరావ్ కనపడలేదు. భోజనం చెయ్యకుండా కూర్చుంది.

మధ్యాహ్నం రెండయిపోయింది! తన భర్త జాడ లేదు.

ఆరినబట్టలు తీసుకువద్దామని డాబా పైకి వెళ్ళింది. డాబా మీద కొబ్బరి చెట్టు నీడలో మఠం వేసుకు కూర్చున్నాడు ఆనందరావ్.

"ఇదేమిటి, ఇక్కడ కూర్చున్నారు! బియ్యం కొనే ప్రయత్నంలో బయటకి వెళ్ళారనుకున్నాను. "ఏంలేదు! ఆ పైన మీ యిష్టం" అని నువ్వే కదా చెప్పావు అందుకని ఈ డాబా మీద కూర్చున్నాను"

"బాగుంది వరస! అంతానాకర్మ! పైన అంటే డాబా మీద నా! ఆ పైన అంటే స్వర్గంలో ఇష్టం మన్నమాట! చాలు ముచ్చట! బియ్యం సంగతి తర్వాత చూద్దాం! ఇక దిగిరండి, ఈ రోజు వండుకున్న అన్నం తిందాం! అంది మలయవతి.

(ఆవలి తీరం సెప్టెంబర్ 2009)